నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, గురువారం 1 ఆగస్టు 2024 | VIKARABAD



విలేకరుల సమావేశంలో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన 100 పడకల దవాఖాన ప్రొసీడింగ్ జీవో కాపీని చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

## కల్వకుర్తికి రిక్తహస్తం

**బీఆర్ఎస్ నాయకులను తిట్టడానికే సీఎం కల్వకుర్తిలో బహిరంగ సభ పెట్టుకున్నారా.??**

**ఈ ప్రాంత సమస్యలపై ఎమ్మెల్యేకు అవగాహన లేదా..**

**ఉంటే కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన పనులను మళ్లీ అడగటమేమిటి..**

**సీఎం రేవంత్‌రెడ్డి సభపై మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**

ఆమనగల్లు, జూలై 31 : కల్వకుర్తిలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభ కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఉన్నదని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఎద్దేవా చేశారు. కేవలం బీఆర్ఎస్ నాయకులను తిట్టడానికే కాంగ్రెస్ పార్టీ పెట్టుకున్న ఎన్నికల సభలా ఈ బహిరంగ సభ ఉందని ఆయన మండిపడ్డారు.బుధవారం కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడారు. కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి అంటే అందరికీ గౌరవం ఉందని, పార్టీలకు అతీతంగా ఆయనకు ఎంతో మంది అభిమానులు ఉన్నారని గుర్తు చేశారు. విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని, బహిరంగ సభను కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలా మార్చారని మండిపడ్డారు. ఇంతకు ఈ కార్యక్రమం అధికారిక కార్యక్రమమా.. పార్టీ కార్యక్రమమా అని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో పాటు ఉన్నత స్థాయి అధికారులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారని, ఈ కార్యక్రమానికి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడం సబబేనా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ ప్రాంత అభివృద్ధికి నీతినిజాయితీతో మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డితో పాటు మాజీ మంత్రి మహేంద్ర నాథ్, మాజీ ఎమ్మెల్యేలు ఎడ్మ కిష్టారెడ్డి, ద్యాప గోపాల్‌రెడ్డి పని చేశారని చెప్పిన రేవంత్‌రెడ్డి తను అవమానపరిచాడని మండిపడ్డారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా తాను మాజీ మంత్రిగా రాములు ఈ ప్రాంతానికి నీతి నిజాయితీగా పని చేయలేదా అంటూ విరుచుకుపడ్డారు. దాదాపు 5వేల కోట్లతో కల్వకుర్తి ప్రాంతాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశానని ఉద్ఘాటించారు. కేసీఆర్ ప్రభుత్వం పాలమూరు– రంగారెడ్డి పథకానికి దాదాపు 35 వేల కోట్లు ఖర్చుపెట్టి 60 టీఎంసీల నీరు నిలువ ఉండేలా భారీ రిజర్వాయర్‌ల నిర్మాణం చేపట్టి పూర్తి చేసిందని, పంప్‌హౌజ్‌ల నిర్మాణం కూడా పూర్తి చేసిన సంగతిని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం కాలువలు పూర్తి చేసి మూడు జిల్లాల రైతులకు దాదాపు 12.50లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉందని, ముందుగా కాల్వల పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ ప్రాంత ప్రజలకు సేవలందించిన సూదిని జైపాల్‌రెడ్డి పేరును పాలమూరు– రంగారెడ్డి పథకానికి పెట్టాలని, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇచ్చేలా బడేభాయ్ అయిన పీఎం మోడీని ఒప్పించే బాధ్యత రేవంత్‌రెడ్డి తీసుకోవాలని జైపాల్‌యాదవ్ మరోమారు డిమాండ్ చేశారు. ఈ ప్రాంత ఎమ్మెల్యేకు ప్రాంత సమస్యలు, అభివృద్ధిపై కనీస అవగాహన లేదనిపిస్తుందని అన్నారు. ఉంటే కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని మరిచి అవే పనులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని అడగటం చూస్తుంటే నవ్వు వస్తున్నదని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు.కల్వకుర్తిలో 50 పడకల కమ్యూనిటీ ఆసుపత్రిని కేసీఆర్ ప్రభుత్వం 100 పడకల ఆసుపత్రిగా మారుస్తూ 2023 జూన్ 28న 366 జీఓ ఇచ్చిందని, ఇందుకు సంబంధించి మూడు ఎకరాల స్థలం కేటాయించడంతో పాటు నిధులు మంజూరు చేసిందని, టెండర్ పూర్తయి పనులకు సంబంధించి గుత్తేదారు అగ్రిమెంట్ కూడా చేసుకున్నాడని వివరించారు. అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పనులకు శంకుస్థాపన చేసిన విషయాన్ని మాజీ ఎమ్మెల్యే గుర్తు చేశారు. కల్వకుర్తిలో 100 పడకల ఆసుపత్రి కావాలని ఈ ప్రాంత ఎమ్మెల్యే ముఖ్యమంత్రిని కోరడంపై వ్యంగోక్తులు విసిరారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే ఎస్సీ గ్రామాల రోడ్ల నిర్మాణాలకు, గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ఇతోధికంగా నిధులు మంజూరయ్యాయని, పనులు ప్రగతిలో ఉన్నాయని, మళ్లీ అవే పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ముఖ్యమంత్రిని అడగటం ఆశ్చర్యంగా అనిపించిందని అన్నారు.

ఏది ఏమైనా ఎమ్మెల్యే ఈ ప్రాంతానికి మెడికల్ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల, స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ, పారిశ్రామిక కారిడార్, పాలిటెక్నికల్ తదితర అభివృద్ధి పనులను అడిగితే.. టీవీలు చూస్తున్న తామందరం సంతోషించామని, తీరా రేవంత్‌రెడ్డి ఇరవై, ముప్పై కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించి పుట్టిన గడ్డకు శూన్య హస్తం చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్వకుర్తిలో రేవంత్‌రెడ్డికి ఇల్లు కూడా ఉంది. ఈ ప్రాంతంలోనే చిన్నతనంలో ఆయన చక్కర్లు కొట్టారు.. అయినా ఈ ప్రాంతంపై ఆయనకు ఏమాత్రం ప్రేమలేదనే విషయం ఆయన విదిల్చిన వరాలు చూస్తేనే అర్థమవుతున్నదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్, బాలయ్య, చెన్నకేశవులు కౌన్సిలర్ సూర్యప్రకాశ్‌రావు, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ రాజ్యమంటే మహిళలను అగౌరవపర్చడమేనా.. ఒక మహిళా ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసం.. ఇది యావత్ మహిళా లోకానికి జరిగిన అవమానం.. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే సబితారెడ్డికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలి' అని పలువురు మహిళలు, బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే సబితారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు చేసిన అవమానకర వ్యాఖ్యలను నిరసిస్తూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు తెలిపారు. పలుచోట్ల సీఎం, డిప్యూటీ సీఎంల దిష్టిబొమ్మలను దహనం చేసి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.



బాలాపూర్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

# ఇదేనా ఇందిరమ్మ రాజ్యం !

## శాసన సభలో ఎమ్మెల్యే సబితారెడ్డిని సీఎం అవమానించడంపై భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు

**సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు క్షమాపణ చెప్పాలని డిమాండ్**

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలు**

**సీఎం, డిప్యూటీ సీఎంల దిష్టిబొమ్మలు దహనం**

ఆర్కేపురం, జూలై 31 : సబితారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఆర్కేపురంలోని ఎన్టీఆర్‌నగర్ చౌరస్తాలో మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేశ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబితారెడ్డిని విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలకు లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవిలో కూర్చోవడానికి మహిళలే ప్రధాన కారణమని, అలాంటి మహిళలను విమర్శించి బాధ పెట్టడం తగదన్నారు. కార్యక్రమంలో న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, గొడుగు శ్రీనివాస్, జై శ్రీమన్నారాయణ, కంచర్ల శేఖర్, మంత్రి రవీందర్‌రావు, శ్యామ్‌గుప్తా, శ్రీరాములు, జహీర్, మురళీధర్‌రెడ్డి, నవీన్‌గౌడ్, అనురాధ, రోజా, పద్మ, జయమ్మ తదితరులు ఉన్నారు.

### మీర్‌పేటలో..

బడంగ్‌పేట : మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దిష్టిబొమ్మలను బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో దహనం చేశారు. ఎమ్మెల్యే సబితారెడ్డిని అవమానించిన రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కలు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, కార్పొరేటర్లు అనిల్‌కుమార్ యాదవ్, రాజేందర్‌రెడ్డి, సిద్దాల లావణ్యబీరప్ప, బీఆర్ఎస్ నాయకులు దిండు భూపేశ్‌గౌడ్, విజయలక్ష్మి, యాదగిరి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సురభి లత, మాధవి, గోపీయాదవ్, బషీర్, నాగరాజు, జంగయ్య, మహేందర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.




అసెంబ్లీలో జరిగిన అవమానాన్ని మీడియాకు వివరిస్తూ కన్నీటి పర్యంతమైన ఎమ్మెల్యే సబితారెడ్డి



ఆర్కేపురంలోని ఎన్టీఆర్‌నగర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న అరవింద్‌శర్మ, పెండ్యాల నగేశ్, బీఆర్ఎస్ శ్రేణులు

# మళ్లీ నిరాశే..



- రెండో విడుతలోనూ కొంతమందికే రుణమాఫీ
- మొదటి విడుతలోని సమస్యలే పునరావృతం
- కొన్ని బ్యాంకుల్లో అతి తక్కువ మందికే వర్తింపు
- గగ్గోలు పెడుతున్న రంగారెడ్డి జిల్లా రైతాంగం

రంగారెడ్డి, జూలై 31 (నమస్తే తెలంగాణ) : మొన్న రూ.లక్ష.. నిన్న లక్షన్నర.. రుణమాఫీ విషయంలో అవే కొర్రీలు.. అవే తిప్పలు. మొదటి విడుతలో ఏ కారణాలతో రుణమాఫీకి దూరమయ్యారో.. అవే కారణాలతో రెండో విడుతలోనూ మెజార్టీ రైతులకు రుణ విముక్తి కలగలేదు. రంగారెడ్డి జిల్లాలో మొదటి విడుతలో 49,700 మంది రైతులకు రూ.258.18కోట్ల రుణమాఫీ, రెండో విడుతలో 22,915 మందికి రూ.218.12 కోట్ల రుణమాఫీ చేసినట్లు ప్రభుత్వం చెబుతున్నది. అయితే అంకెలు మారాయి కానీ.. మాఫీ విషయంలో మాత్రం అందరి వెతలు ఒకేలా ఉన్నాయని రైతులు వాపోతున్నారు. ఎప్పటి లాగే.. రైతులు రెండో విడుత రుణమాఫీ తర్వాత కూడా వ్యవసాయ అధికారుల వద్దకు, బ్యాంకుల వద్దకు పరుగులు పెడుతున్నారు. సైట్‌లో లాగిన్ అయి చెబుతామని అధికారులు చెబుతున్నప్పటికీ రైతుల్లో ఆందోళన మాత్రం తగ్గడం లేదు.

### డీసీసీబీ బ్యాంకులో కొంతమందికే..

రంగారెడ్డి జిల్లా డీసీసీబీ పరిధిలో రూ.లక్ష లోపు రుణం తీసుకున్న రైతులు సుమారు 34వేల వరకు ఉండగా..ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో కేవలం 11,700 మంది రైతుల పేర్లు మాత్రమే వచ్చాయి. మిగిలిన 22వేల మంది రైతులకు రుణమాఫీ కాలేదు. రెండో విడుత జాబితాలోనూ డీసీసీబీ బ్యాంకుల్లో మొక్కుబడిగానే రుణమాఫీ జరిగింది. ఐసీఐసీఐ బ్యాంకు పరిధిలో 11 మందికే రుణ విముక్తి కలిగింది. దీంతో మిగతా రైతులకు మొండిచెయ్యి చూపినట్లేనా? అన్న భావన రైతుల్లో కలుగుతున్నది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులందరికీ రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని, భార్యాభర్తలిద్దరినే కుటుంబ సభ్యులుగా పరిగణించాలని, వేరుగా ఉంటున్న కుమారులకు కూడా రుణమాఫీ వర్తింపజేయాలని రైతులు కోరుతున్నారు. కొద్దిమందికే మాఫీ చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేయవద్దని రైతాంగం ప్రభుత్వాన్ని కోరుతున్నది.

**బ్యాంకుల వారీగా రుణమాఫీ అయిన రైతుల వివరాలు..**

| బ్యాంకు పేరు | రైతుల సంఖ్య | మాఫీ అయిన రుణం |
|---|---|---|
| ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ | 5,925 | రూ.57,39,20,236 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 347 | రూ.3,18,38,352 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 145 | రూ.1,20,00,061 |
| కెనరా బ్యాంక్ | 2,629 | రూ.26,52,57,816 |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 278 | రూ.1,80,98,576 |
| డీసీసీబీ హైదరాబాద్ | 2,258 | రూ.16,23,80,002 |
| డీసీసీబీ మహబూబ్‌నగర్ | 516 | రూ.3,94,29,827 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లిమిటెడ్ | 02 | రూ.2,18,591 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 11 | రూ.11,67,837 |
| ఐడీబీఐ బ్యాంక్ | 02 | రూ.1,92,361 |
| ఇండియన్ బ్యాంక్ | 191 | రూ.1,54,52,595 |
| పంజాబ్ నేషనల్ బ్యాంక్ | 230 | రూ.2,20,75,997 |
| స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 5,443 | రూ.55,46,47,041 |
| తెలంగాణ గ్రామీణ బ్యాంక్ | 2,320 | రూ.22,85,73,644 |
| యూకో బ్యాంక్ | 22 | రూ.21,53,057 |
| యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 2,588 | రూ.25,32,41,725 |

### అవే కొర్రీలు.. అవే తిప్పలు..

- ప్రభుత్వం చెబుతున్నది ఒక విధంగా ఉండగా.. వాస్తవానికి అనేక రకాల నిబంధనలను అమలు చేయడంతో అర్హులు సైతం రుణ మాఫీకి దూరమయ్యారు.
- కాలపరిమితి 2023 డిసెంబర్ 9 నాటికి లోను ఖాతాలో ఉన్న అవుట్ స్టాండింగ్ అమౌంట్ ఎంత ఉంటే అంతమాత్రమే మాఫీ అయింది.
- రేషన్‌కార్డులేని వారికి రుణాలు మాఫీ కాలేదు. ప్రభుత్వం పాస్‌బుక్కులు ప్రామాణికం అని చెప్పినప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం అది పూర్తిస్థాయిలో కార్య రూపం దాల్చలేదు.
- రుణం రీ షెడ్యూల్ చేసుకున్న వారికి కూడా రుణమాఫీ జరగలేదు.
- పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వర్తించిన వారికి కూడా రుణమాఫీ కాలేదు.

### ఇదీ.. రైతుల ఆవేదన..

- ఆదాయపన్ను చెల్లింపుదారులు, ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్ దారులను అర్హుల జాబితా నుంచి ప్రభుత్వం తొలగించడంతో చాలామంది రైతులు రుణమాఫీకి దూరమయ్యారు.
- రేషన్‌కార్డులేని వారికి గుర్తించలేదు. ఫలితంగా తమకు రుణ మాఫీ జరగలేదు.
- ఆధార్ మిస్‌మ్యాచ్.. ఆధార్ కార్డులో పేరుకు, బ్యాంక్ పాస్‌బుక్‌లో పేరు స్పెల్లింగ్‌లో వ్యత్యాసం ఉన్నా.. రుణమాఫీ వర్తించలేదు.
- పాసుబుక్కులు లేని రైతులకు రుణమాఫీ కాలేదు.
- బ్యాంకు మేనేజర్ల ఒత్తిడితో బలవంతంగా ముందే లోను కట్టినవారికి మాఫీ జాబితాలో పేరు రాలేదు.
- రుణం తీసుకుని మృతి చెందిన వాళ్ల విషయంలోనూ ఇదే జరిగింది. వారి కుటుంబ సభ్యులు బ్యాంకు అధికారుల ఒత్తిడితో రుణం కట్టగా.. తీరా.. ప్రస్తుతం ఆ రుణం మాఫీ కాలేదు.

## రైతుబీమా సాయంలో జాప్యం

**గతంలో వారంలోనే రైతు కుటుంబానికి బీమా సాయం**

**నేడు నెల రోజులైనా పరిష్కారం కాని క్లెయిమ్‌లు**

**కొత్తగా చేరే రైతులకు ఆగస్టు 5వ తేదీ వరకు అవకాశం**

బొంరాస్‌పేట, జూలై 26 : అన్నదాతను ఆదుకోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది. రైతు ఏ కారణంచేతనైనా మృతి చెందితే ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి రైతుబీమా పథకాన్ని 2018లో ప్రవేశపెట్టింది. రైతుపేరు మీద ప్రభుత్వమే ఎల్ఐసీ ప్రీమియం చెల్లించింది. 18 నుంచి 59 ఏండ్లలోపు వయసున్న రైతులు రైతుబీమాలో దరఖాస్తు చేసుకుంటే వారు మృతి చెందిన తర్వాత రూ.5 లక్షల బీమా సాయాన్ని ప్రభుత్వం రైతు నామినీకి ఇచ్చింది. రైతు కుటుంబీకులు బీమా సాయం కోసం వ్యవసాయాధికారులకు దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లోనే నామినీ ఖాతాలో డబ్బులు జమయ్యేవి. కానీ నేడు రైతు మృతి చెంది నెల రోజులవుతున్నా బీమా సాయం అందకపోవడం బాధాకరం. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 1071 మంది రైతులు మృతి చెందితే 955 మంది రైతు కుటుంబాలకు మాత్రమే బీమా సాయం అందింది. ఇంకా 116 మంది రైతు కుటుంబాలకు బీమా సాయం అందాల్సి ఉన్నది. చనిపోయిన రైతు కుటుంబ సభ్యులు సర్టిఫికెట్, ఒరిజినల్ పట్టా పాసు పుస్తకం వంటి వాటిని వ్యవసాయాధికారులు అదనంగా అడుగుతున్నారు. ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్‌లో పొందాలంటే ఆలస్యమవుతున్నది. వీటి కారణంగానే రైతులకు బీమా సాయం ఆలస్యంగా అందుతున్నది.

### కొత్త వారు చేరడానికి ఆగస్టు 5 వరకు అవకాశం..

రైతుబీమా పథకాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తున్నది. గతంలో లాగే ఈ పథకంలో కొత్తగా రైతులు చేరడానికి ఆగస్టు 5వ తేదీ వరకు ప్రభుత్వం గడువు ఇచ్చింది. ఈ ఏడాది జూన్ 28 వరకు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు ఆగస్టు 5వ తేదీలోగా తమ పేర్లను ఏఈవోల వద్ద నమోదు చేసుకోవాలి. 18 నుంచి 59 ఏండ్ల లోపు వయసు ఉండి తమ పేరుమీద భూమి, పట్టాదారు పాసు పుస్తకం ఉన్న రైతులందరూ రైతుబీమాకు అర్హులు. ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా నంబరు, పట్టాదారు పాసు పుస్తకం, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్‌లతో పాటు నిర్ణీత దరఖాస్తు ఫారాన్ని ఏఈవోలకు అందజేస్తే వారు పరిశీలించి రైతుల పేర్లను రైతుబీమా పథకంలో నమోదు చేస్తారు. అదేవిధంగా గతంలో బీమా పథకానికి దరఖాస్తు చేయని రైతులు, నామినీ పేర్లలో మార్పులు చేసుకోవాలనుకునే రైతులు కూడా తగిన ధ్రువీకరణ పత్రాలను ఏఈవోలకు అందజేసి మార్పులు చేసుకోవడానికి, బీమా పథకంలో చేరడానికి అవకాశం కలిగించారు. బీమా పథకంలో నేటి వరకు చేరని రైతులకు వ్యవసాయాధికారులు సమాచారం ఇచ్చి అవగాహన కల్పిస్తున్నా కొంతమంది రైతులు బీమా పథకానికి దరఖాస్తు చేయడం లేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

### 5798 మంది రైతులకు రూ.289.90 కోట్ల బీమా సాయం..

రైతుబీమా పథకం 2018లో ప్రారంభమైంది. ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి వికారాబాద్ జిల్లాలో 5798 మంది రైతులకు రూ.5 లక్షల చొప్పున రూ.289.90 కోట్ల బీమా సహాయాన్ని ప్రభుత్వం అందజేసింది.